

• బాన్సువాడలోని కల్కి చెరువు (ఫైల్)



• దేవునిపల్లిలో కుంటలో మట్టిని వేసిన దృశ్యం (ఫైల్)



- హైడ్రా తరహాలో పట్టణాల్లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుకు సర్కారు కసరత్తు
- జిల్లాలో ప్రభుత్వ భూములు, శిఖం భూముల కబ్జా
- బఫర్‌జోన్లలోనూ కట్టడాలు
- కబ్జాలపై గతంలోనూ జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ ఉన్నా చర్యలు శూన్యం
- ఆ కమిటీని పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆలోచన
- సర్కారు భూముల్లో అక్రమ కట్టడాలపై చర్యలు పూనుకోనున్న ప్రభుత్వం
- జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో చెరువుల శిఖం భూముల కబ్జాలు

ఆక్రమణలపై ఆరా!



కామారెడ్డి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలో హైడ్రా హడలెత్తిస్తోంది. చెరువులు, కుంటల శిఖం, ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను హైడ్రా కుల్చివేస్తుండడంతో ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలో హైడ్రా తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆయా జిల్లాల్లో పట్టణాలతో పాటు గ్రామాల్లో చెరువులు, కుంటల శిఖం భూములను, ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వాటి వివరాలు సేకరించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా సంబంధిత శాఖ అధికారులు ప్రభుత్వ భూముల కబ్జా ఆ భూముల్లో అక్రమ కట్టడాలపై ఆరా తీస్తున్నారు. ఇందుకోసం కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో వందల సంఖ్యలోనే చెరువులు, కుంటల శిఖం భూములు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమార్కులు నిర్మాణాలు చేపట్టినట్లు అధికారుల విచారణలో తెలనుంది.

హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థ

హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల కబ్జా, అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకుంటుంది. అయితే అన్ని జిల్లాలోనూ హైడ్రా తరహాలో వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ పట్టణాలలో చెరువులు, శిఖం భూములు, బఫర్ జోన్‌లో అడ్డగోలుగా నిర్మాణాలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో చెరువులు రక్షణ కోసం దృష్టిపెట్టిన ప్రభుత్వం హైడ్రా వ్యవస్థతో వాటిని సంరక్షించాలని భావిస్తోంది. జిల్లాలో అక్రమార్కులు ప్రభుత్వ భూములను చాలా కబ్జాచేశారు. ఇటీవల బాన్సువాడ పట్టణ కేంద్రంలో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కల్కి చెరువులోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని రెండున్నర ఎకరాల గ్రామ కంఠం భూమిని ఆక్రమించి ప్లాట్లుగా మార్చి వెంచర్ చేశారు. దీనిపై కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోనూ దేవునిపల్లిలో ప్రధాన రహదారి పక్కనున్న కుంటను కొందరు కబ్జాచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ కుంటలోకి మట్టి పోసి సుమారు 2 ఎకరాల భూమిని కబ్జా పెట్టారు. పలు చోట్ల కాలువల పైన నిర్మాణాలు చేపట్టడంతో వర్షా కాలం వస్తే నీరంతా రోడ్డుపైన నిలుస్తోంది. ఎల్లారెడ్డి పట్టణ శివారుల్లోని పోకాలకుంటకు సంబంధించిన ఎకరంన్నర భూమిని కొందరు రియల్ వ్యాపారులు కబ్జాచేసి మట్టి పోసి వెంచర్‌గా మార్చారు. ఇటీవల ఓ చెరువుకు సంబంధించిన ప్రభుత్వ శిఖం భూమిని కబ్జా చేశారు. ఇలా చెరువులు, కుంటల శిఖం భూములే కాకుండా ప్రభుత్వ, అసైన్ భూములను సైతం వందల ఎకరాలలోనే కబ్జా చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

జిల్లాలో ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు కలెక్టర్ నేతృత్వంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటైంది. ఇప్పటివరకు ఎక్కడెక్కడ ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయే వాటిని గుర్తించి వాటిలో ఉన్న అక్రమ కట్టడాలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. గతంలోనే టాస్క్‌ఫోర్స్ కమిటీ ఉన్నప్పటికీ కొద్దిరోజుల పాటు నామ్‌కే వాస్తేగా పనిచేసిందే తప్ప పెద్దగా తీసుకున్న చర్యలు కనబడలేదు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలను తొలగించేందుకు హైడ్రాను ఏర్పాటుచేయగా చెరువు, శిఖం భూముల్లో, ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్‌జోన్‌లో నిర్మించిన కట్టడాలను, నాలాలపై నిర్మించిన కట్టడాలను బుల్డోజర్లను పెట్టి కుల్చివేస్తున్న విషయం తెలిసిందే. అదే తరహాలో జిల్లాలో కూడా ప్రభుత్వ ఆస్తులకు చెరువులకు, కుంటలకు రక్షణ కల్పించేందుకు ఆక్రమణాలను తొలగించేందుకు గత టాస్క్‌ఫోర్స్ కమిటీలను ప్రభుత్వం పునరుద్ధరిస్తోంది. కలెక్టర్ చైర్మన్‌గా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీఎస్పీ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), డీపీవో, నీటి పారుదల శాఖ, ల్యాండ్ అండ్ సర్వే రికార్డు, ఆర్‌డీఓలు, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లు కమిటీ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ జిల్లాలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, శిఖం భూములు తదితర ఆస్తుల ఆక్రమణకు గురికాకుండా సంరక్షించడానికి పనిచేస్తుంది. ఇప్పటివరకు జిల్లాలో ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయా? వాటి పరిస్థితి ఏంటి? అంశాలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆరాతీస్తోంది. భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించాలని భావిస్తోంది.

పైరవీలకు తావులేకుండా..

ప్రభుత్వ ఆస్తులలో అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపేందుకు ఎలాంటి పైరవీలూ లేకుండా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. చెరువులు, కుంటల శిఖం భూములు కాని నాలాలు కబ్జాకు గురికావడంతోపాటు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే వాటిలో వెలిసిన అక్రమనిర్మాణాల గురించి ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చని అధికారులు చెబుతున్నారు. నేరుగా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొంటున్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఇతరత్రా సోషల్ మీడియాల ద్వారా ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణపై వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించనున్నారు. జిల్లాలో ఆయా పట్టణాలు, గ్రామాల్లో గల పలు చెరువులు, కుంటల శిఖం భూముల ఆక్రమణకు గురైనట్లుగా తెలుస్తోంది. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు వాటి హద్దులను నిర్ణయిస్తే ఆక్రమణాలు బయటపడే అవకాశాలు లేకపోలేదు. రెవెన్యూ రికార్డులను అనుసరించి ఇతర ప్రభుత్వ ఆస్తుల గురించి కూడా ఆరా తీసి ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



దేవునిపల్లిలో కుంటలో మట్టిని వేసిన దృశ్యాలు (ఫైల్)



అలరించిన రాధాకృష్ణులు

జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో అలరించారు. ఆయా ఆలయాల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

• రాధా కృష్ణుడి వేషధారణలో చిన్నారులు




పొలంబాటలో విద్యార్థినులు

హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు పొలంబాట పట్టారు. సోమవారం సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడి గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డికి చెందిన పత్తిపంటలో విద్యార్థులు క్షేత్రస్థాయి ప్రోగ్రాంలో భాగంగా వ్యవసాయ పనులు చేశారు. పత్తిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించి రసాయనిక ఎరువులువాడే విధానాన్ని తెలిపారు.

• సదాశివనగర్



• ఫ్లోరింగ్ లేకుండా అస్తవ్యస్తంగా ఉన్న బాత్‌రూం



- టాయిలెట్లు లేక విద్యార్థుల అవస్థలు
- అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో కస్తూర్బాలో పనులు
- ఆ పనులూ నత్తనడకన సాగుతున్న వైనం
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



కిటికీలకు అద్దాలు లేని దృశ్యం

నిజాంసాగర్ కస్తూర్బాలో విద్యార్థినుల పాట్లు!

నిజాంసాగర్, ఆగస్టు 26: నిజాంసాగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అరకొర వసతులతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మౌలిక సదుపాయాల కోసం పనులు చేపడుతున్నా అవి నత్తనడకన సాగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంసాగర్ మండలకేంద్రంలో 2007లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని స్థాపించింది. మొదట్లో అద్దెభవనంలో మూడేళ్లపాటు అరకొర వసతుల మధ్య విద్యాభ్యాసం సాగింది. సర్వేనెంబర్ 433లో నూతన భవనం నిర్మించారు. కొత్తలో అన్ని మౌలిక వసతులు కల్పించినా కొన్నాళ్లకే సమస్యలు మొదలయ్యాయి.

అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో కస్తూర్బాలో పనులు

ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలకు రూ.12లక్షలు మంజూరు చేయగా ఆ నిధులతో కస్తూర్బాలో మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ మరమ్మతులకు రూ.3లక్షలు, విద్యాలయంపై కప్పు మరమ్మతుకు రూ.4లక్షలు, బాత్‌రూంలు, టాయిలెట్ల కోసం రూ.5లక్షలు కేటాయించారు. విద్యాలయంలో డ్వాక్రా మహిళా సభ్యులు పనులు చేపట్టగా, మహిళా సంఘాలు ముందుకు రాకపోవడంతో కొందరు నాయకులు వారిపేరిట బినామీలతో పనిచేయిస్తున్నారు. రూ.3లక్షలతో విద్యుత్ పరికరాలు, మరమ్మతులకు ఖర్చుచేసినట్లు తెలుస్తోంది. విద్యాలయంలో గతంలో ఫ్యాన్లు, లైట్లు, విద్యుత్ లైన్లు ఉన్నా రూ.3లక్షలు విద్యుత్‌కు కేటాయించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.4లక్షలు ఫ్లోరింగ్‌కు కేటాయించగా, రూ.5లక్షలు బాత్‌రూంలు, టాయిలెట్ల కోసం కేటాయించారు. బాత్‌రూం పనులు ఇప్పటికీ చేపట్టలేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బాత్‌రూంలు కూలిపోగా, వంటశాల వద్ద కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రహరీ కూలినా గోడ నిర్మించడం లేదు.

అసంపూర్తిగా కళాశాల భవనం

విద్యాలయ ఆవరణలో గతంలో రూ.కోటీల 40లక్షలతో కేజీబీవీ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. అయితే కళాశాల భవనం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మరో రూ.30లక్షలు అవసరమని ఇంజనీర్ అధికారులు చెప్తున్నారు. కళాశాల భవన సముదాయం రెండస్థులుండగా, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కిటికీలు, విద్యుత్ లైట్లు, బాత్‌రూం ఫ్లోరింగ్, డార్మెంటరీ తరగతి గదిలో ఫ్లోరింగ్ పనులు చేపట్టలేదు. కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న 160 మంది విద్యార్థులు అరకొర వసతుల మధ్య బిక్కుబిక్కుమంటున్నారు.

కళాశాలకు ప్రహరీ కరువు

విద్యార్థినీలు ఉంటే బాలికల కళాశాలకు ప్రహరీ సక్రమంగా లేకపోవడంతో విద్యార్థినీలు రాత్రివేళలో భయం భయంగా గడుపుతున్నారు. విద్యాలయంలో విద్యార్థులు పలు సమస్యలతో సతమతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. 2010లో కస్తూర్బా భవనం నిర్మాణం చేసినా నేటి కీ భవన కనీసం కలరింగ్ చేయలేదు. ఉన్నతాధికారులు స్పందించి కస్తూర్బాలోని సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



మున్సిపల్ ఆవరణలో అమృత్ 2.0 మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

అమృత్ 2.0 పథకానికి ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ఎంపిక

- పుష్కలంగా తాగునీటి సరఫరా
- రూ.35 కోట్లు మంజూరు
- నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రత్యేక పైప్‌లైన్లు

ఎల్లారెడ్డి, ఆగస్టు 26: ప్రజలకు పుష్కలంగా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అటల్ మిషన్ ఫర్ రేజువేనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ (అమృత్) 2.0 పథకంలో కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి మున్సిపాలిటీని ఎంపికైంది. ఈ పథకం యొక్క ఉద్దేశం తాగునీటి కోసం ప్రత్యేకంగా నాలుగు వాటర్ ట్యాంకులు 900 కేఎల్, 500 కేఎల్, 200 కేఎల్ సామర్థ్యం గల ట్యాంకులను ముందు నిర్మిస్తారు. అనంతరం వాటి ద్వారా ప్రత్యేకంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి ప్రతీ ఇంటికి ప్రత్యేకంగా నల్లాల ద్వారా ప్రజలకు శుద్ధమైన తాగునీటిని సరఫరా చేస్తారు. జిల్లాలో ఎల్లారెడ్డి మున్సిపాలిటీని ఎంపిక చేయడం వల్ల ప్రజలు తాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకాన్ని స్థానిక ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చేతుల మీదుగా మెగా కంపెనీ వారు ప్రారంభించనున్నారు.

రెగ్యులర్ వీసీల నియామకం ఎప్పుడు?

వీసీలు లేక అభివృద్ధికి నోచుకోని యూనివర్సిటీలు
సమావేశంలో టీయూ పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, ఆగస్టు 26: యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను ఎప్పుడు నియమిస్తారని టీయూ పీడీఎస్‌యూ నాయకులు రవీందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెగ్యులర్ వీసీ నియామకాలు చేపట్టకపోవడం వల్ల యూనివర్సిటీలో అభివృద్ధి పనులు జరగడంలేదన్నారు. నిత్యం సమస్యలతో యూనివర్సిటీలు కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. ఇన్‌చార్జి వీసీలు యూనివర్సిటీలను సందర్శించడం లేదని, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నూతనంగా బాలికల హాస్టల్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వంశీ, యాదగిరి, మణికంఠ, సాయిప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని అభ్యర్థుల ఆందోళన

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 26: నగరంలోని ప్రగతినగర్ ప్రాంతంలో ఉన్న సింక్రో సర్వ్ గ్లోబల్ సొల్యూషన్ సంస్థలో శిక్షణ కాలం పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని శిక్షణ పూర్తయిన అభ్యర్థులు సోమవారం సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధానమంత్రి కౌషల్ యోజన కింద వివిధ కోర్సులు పూర్తి చేసిన తమకు సర్టిఫికెట్ ఇవ్వడం లేదని శిక్షణ పూర్తయిన 20 రోజుల్లోపు సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉండగా మూడు నెలలు పూర్తయినా ఇవ్వడం లేదని అభ్యర్థులు తెలిపారు. సర్టిఫికెట్లు ఇవ్వమంటే కొంత మంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వందలాది మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసి తమ సమయాన్ని వృధా చేసుకున్నారని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి సర్టిఫికెట్లు ఇవ్వాలని లేదంటే ఆందోళన చేస్తామని అభ్యర్థులు తెలిపారు.

రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలి

పెద్దబజార్, ఆగస్టు 26: అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు రుణాలను రీషెడ్యూల్ చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. రుణమాఫీ కాని రైతులందరూ ఈనెల 29న జరిగే మండల ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి'

పెద్దబజార్, ఆగస్టు 26: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని తెలంగాణ ప్రగతిశీల కూరగాయల వ్యవసాయ మార్కెట్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు మచ్చ మోహన్ అన్నారు. సోమవారం నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో వ్యవసాయ కూరగాయల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సెప్టెంబరు 13న ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల ప్రాంతీయ సదస్సుకు అన్ని రంగాల కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు మల్లేష్, వీరయ్య, శంకర్, గంగాధర్, ధర్మయ్య, సోనుబాయి పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ మహాసభలను జయప్రదం చేయాలి

డిచ్‌పల్లి, ఆగస్టు 26: ప్రగతిశీల మహిళా సంఘం పీవోడబ్ల్యూ ఏడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సుప్రియ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు హైదరాబాద్‌లో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 31న ఎస్‌వీకే నుంచి ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ అనంతరం ఇందిరాపార్కులో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీలలో కాట్రగడ్డ శ్రీనివాస్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రతినిధుల మహాసభలు ఉంటాయని అన్నారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజిత, వాసరి శైలజ, సుమలత, దేవిక, నర్సుబాయి, భూదేవి, సుజాత, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

'డైట్ సప్లయి టెండర్లను రద్దు చేయాలి'

ఖిల్లా, ఆగస్టు 26: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డైట్ సప్లయి టెండర్లను పూర్తిగా రద్దు చేయాలని అంబేద్కర్ ఎస్సీ, లేబర్ కాంట్రాక్ట్ కో ఆప్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు నాయుడు రాజు అన్నారు. సోమవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. టెండర్ల నోటిఫికేషన్‌కు ముందు నుంచే కొందరు అధికారులు టెండర్ దారులతో కుమ్మక్కై గతంలో డైట్ సప్లయి చేసిన వారికే టెండర్ దక్కేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. టెండర్ దరఖాస్తు ఫారాలు పూర్తిగా ఎవరికీ అర్థం కాని పద్ధతిలో పదజాలాన్ని సమకూర్చారని అన్నారు. అదే దరఖాస్తుఫారం వరంగల్‌లో పూర్తి పదజాలం అర్థం అయ్యే రీతిలో ఉందన్నారు. శుక్రవారం జరిగిన స్క్రూట్నీలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధించిన అధికారులు స్క్రూట్నీ చేయకుండానే ఇతర ప్రాంతాల్లో పని చేసే అధికారులను పిలపించి టెండర్లు నిర్వహించారని అన్నారు. టెండర్‌లో పాల్గొన్న వారికి దరఖాస్తులు చేసుకున్నారా, జీఎస్టీ చెల్లిస్తున్నారా, ఐటీ చెల్లిస్తున్నారా, అనుభవం ఉందా అనే ప్రశ్నలతో వారికి ఉక్కిరిబిక్కిరి చేశారన్నారు. కలెక్టర్ దృష్టి సారించి ఈ టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లకు పిలవాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు సుభాష్‌జాదవ్, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టయ్య, బీసీ నాయకులు దేవందర్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

చింతకుంట సిద్ధుల గుట్ట ఆలయంలో అన్నదానం



ఆలయం వద్ద భక్తుల సందడి

మోస్రా,ఆగస్టు26: మండలంలోని చింతకుంట గ్రామంలో అటవీ ప్రాంతంలో కొలువుదీరిన సిద్ధుల గుట్ట ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గత ఏడు రోజుల నుంచి సప్తా భజన కార్యక్రమాలు నిర్వహించి నేడు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇక్కడ గల రుక్మిణి విఠలేశ్వర స్వామి, నవనాథ్ సిద్దేశ్వర స్వామి ఆలయాలు, పురాతన మహిమ గల ఆలయాలుగా తెలిపారు. మోస్రాతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యల భక్తులు పాల్గొన్నారు.

అమీనాపూర్‌లో కూలిన పాఠశాల ప్రహరీ

వేల్పూర్, ఆగస్టు26:మండలంలో గల అమీనాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరిగోడ ఆకస్మాతుగా కూలిపోయింది. విద్యార్థులు పాఠశాలలో ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పాఠశాలకు సెలవు ఉండడం వల్ల విద్యార్థులకు పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

29 నుంచి మండల స్థాయి క్రీడలు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు26: ఈనెల 29తేదీ నుంచి ఆర్మూర్ మండలస్థాయి రూరల్ అంతర్ పాఠశాలల క్రీడలు చేపూర్‌లోని క్షత్రీయ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎంఈవో రాజగంగారాం తెలిపారు.మూడు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడలకు కన్వీనర్‌గా జడ్పీహెచ్ఎస్ చేపూర్ చేతనకుమారి, కోకన్వీనర్‌గా లక్ష్మీనర్సింహస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.గంగాధర్ పీడీ చేపూర్, కోఆర్గనైజింగ్ కార్యదర్శిగా బ్రుగేష్‌లు వ్యవహరిస్తారని ఎంఈవో తెలిపారు.

శివాలయానికి పోటెత్తిన భక్తజనం



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నభక్తులు

బోధన్‌రూరల్,ఆగస్టు26:బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం నాల్గవ సోమవారం కావడంతో చుట్టు పక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మందర్నా, కల్దుర్కి తదితర గ్రామాల నుండి భక్తులు పాదయాత్రగా శివాలయానికి చేరుకున్నారు. సోమవారం శివాలయం శివనామస్మరణతో మారుమ్రోగింది. వేద పండితులు గణేష్ మహరాజ్, ప్రవీణ్ మహరాజ్ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోధన్ తహసీల్దార్ విఠల్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్ పాఠక్, ఆలయ ఏవో రాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు హరికాంత్ చారి, భూమేష్, మహేష్, రాజు, సుధాకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీలు పనిచేయాలి

• పదవులు కాదు.. రైతులే శాశ్వతం • రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారుడు పోచారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్

కోటగిరి,ఆగస్టు26: మార్కెట్ కమిటీలు రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కోటగిరి మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో సోమవారం పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతుతో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసే వారికి పదవులు వరిస్తాయని అందుకు ప్రస్తుత చైర్మనే నిదర్శమని పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదని, రైతులు శాశ్వతంగా ఉంటారని వారి ఆశలు, ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత పాలకులపైనే ఉందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. పండించిన పంటను మార్కెట్ కమిటీలో నిల్వ చేసుకుని రుణం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు నెలల్లోపు ఎలాంటి వడ్డీ లేకుండా మార్కెట్ కమిటీ రుణం అందిస్తుందన్నారు. మార్కెట్‌లో తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చినప్పుడు అమ్ముకునే సౌకర్యం మార్కెట్ కమిటీలతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రైతులు తలెత్తుకునేలా ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిందన్నారు. రుణమాఫీ అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల మాఫీలో జాప్యం జరుగుతుందన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరించి రైతులకు రుణ విముక్తి కల్పిస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఎక్కడ అవినీతికి తావులేకుండా రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలని సూచించారు. బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి పోకుండా ఉండేందుకు తాను పార్టీని మారినట్లు ఆయన పేర్కొన్నారు. తాను నియోజకవర్గ అభివృద్ధికే తొలి ప్రాధాన్యత ఇస్తానన్నారు. ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయ్యాయని ఆయన పేర్కొన్నారు. పనులు పురోగతి సాధించాలంటే తాను పార్టీ మారాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.ప్రజలు కట్టబెట్టిన పదవులను కాపాడుకోవడం కన్నవారి ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చడమే తన కర్తవ్యంగా భావిస్తానని ఆయన మరోమారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు,మాజీజడ్పీటీసీలు శంకర్‌పటేల్, హెగ్డోలిశంకర్,నాయకులు ఏజాజ్ ఖాన్,గంధపు పవన్,షాహెద్, సిరాజ్,సిద్దు పాల్గొన్నారు.

ఆర్మూర్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



ఆర్టీసీ డీఎంకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు26: ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ ప్రాంగణంలో గల హోటళ్లు, ఇతర దుకాణ సముదాయాలను పరిశీలించారు. సరుకులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్లలో శుభ్రత పాటించాలని, నాణ్యత కూడిన ఆహారం, తినుబండరాలు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఫోన్ ద్వారా ఆర్ఎంతో మాట్లాడిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆర్టీసీ హద్దులను గుర్తించి చుట్టు ప్రహరీ నిర్మించాలని, అదే విధంగా మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతూ చెత్తచెదారం ఎప్పటి కప్పుడు తీయించి బస్టాండ్ పరిసరాల్లో శుభ్రంగా ఉంచాలని అన్నారు. చైన్ స్నాచింగ్, ఇతర దొంగతనాలు జరుగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చేనెల 15లోగా షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు26: వచ్చేనెల 15వ తేదీలోగా ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణాలు మాఫీ చేయాలని రైతు ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలోని కుమార్‌నారాయణ భవనంలో విలేకరుల సమావేశంలో కమిటీ నాయకులు వి.ప్రభాకర్, ఇట్టెడి లింగారెడ్డి, దేగాం యాదగౌడ్, నూతుల శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎకరానికి రూ.15వేల రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా రైతులను ఆందోళన గురి చేసే విధంగా మంత్రులు తల ఒక మాటాడుతున్నారని వారు ఆపేక్షించారు. రుణమాఫీ రాని విషయాన్ని రైతులే రైతుకుటుంబాన్ని ధ్రువీకరించుకొని నిర్ధారించే విధంగా ఈయాప్‌ను తయారు చేశా మనడం సరికాదన్నారు. తప్పుడు డిక్లరేషన్ ఇస్తే రికవరీ చేస్తామనే ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. వచ్చేనెల 15వ తేదీ వరకు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయని పక్షంలో 16వ తేదీన సమావేశమై ఉద్యమకార్యాచరణ ప్రకటిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో దేవరాం, సక్కి సుధాకర్, సంతోష్‌రెడ్డి, లోక రాములు, బాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు

ఘనంగా మథర్‌థెరిస్సా జయంతి



నివాళి అర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు26: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణం లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో సోమవారం మథర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మథర్‌థెరిస్సా విగ్రహానికి పూలమలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృధ్వీరాజ్, సభ్యులు వెంకట్రాంరెడ్డి, ఉదయ్, భైరి శ్రీధర్, తదిత రులు పాల్గొన్నారు.

• లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ ప్రాంగణ లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మథర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పశ్చిమ బెంగాల్‌లోని కల్‌కత్తా నగరంలో నిర్మల్‌హృదయ చారిట్రబుల్ ట్రస్ట్ ద్వారా పేదవారికి, కుష్టువ్యాధి రోగులకు అండగా ఉండి మథర్‌థెరిస్సా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పొల్కం వేణు, సభ్యులు అల్జాపూర్ రాజేష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

బోధన్‌రూరల్,ఆగస్టు26: బోధన్ మండలంలోని ఘన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద లక్ష్మణ్ అనే వ్యక్తి వ్యవసాయ పొలం పనులకు వెళ్తూ అక్కడ వాహనాన్ని నిలిపి ఉంచగా గుర్తు తెలియని దొంగలు ద్విచక్ర వాహనాన్ని దొంగలించారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. పిర్యాదుదారుడు దిలీప్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీసీ పుటేజీల ద్వారా అన్ని కోణాల్లో విచారణ జరిపి దొంగను పట్టుకుని త్వరలోనే వాహనాన్ని బాధితుడికి అందజేస్తామని ఆయన తెలిపారు.

మోతె రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు

వేల్పూర్ ఆగస్టు26: మోతె గ్రామ ప్రజల ఆరాధ్యదైవమైన రాజ రాజేశ్వరస్వామి గుట్ట వద్ద ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో గురడిరెడ్డి గాంధీ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గురడిరెడ్డి గాంధీ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలి

ధర్పల్లి, ఆగస్టు 26: మండల కేంద్రంలో గల డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి వారికి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇండ్లులేని నిరుపేదలతో కలిసి డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన ఇంత వరకు పంపిణీ చేయడంలో జాప్యం వహిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లను పేదలకు పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. వెంటనే పూర్తయిన ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామోదర్, రంజిత్,నూర్జహాన్, జమునలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు వైద్యపరీక్షలు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు26: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో ఎస్సీ, బీసీ బాలికల పాఠశాలలోని విద్యార్థినిలకు యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో రమేష్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య పరీక్షల అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బట్టు ఆనంద్, హాస్టల్ వార్డెన్‌లు జయసుశీల, షబాన, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రేశ్వరాలయంలో శ్రావణమాస పూజలు

సదాశివనగర్,ఆగస్టు 26: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి వీరభద్రేశ్వర ఆలయంలో శ్రావణమాసం నాల్గొవ సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి శివనామస్మరణ చేశారు. అనంతరం మహాయజ్ఞం నిర్వహించారు.ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వాదించారు.

బాన్సువాడలో కురిసిన వర్షం



బాన్సువాడలో వర్షం కురుస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్ , ఆగష్టు 26 : బాన్సువాడ పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఆశించిన విధంగా వర్షం కురియకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా కురిసిన వర్షంతో ఆరుతడి పంటల ఎదుగుదలకు దోహదపడుతోందని రైతన్నలు పేర్కొంటున్నారు.

జోడు లింగేశ్వర ఆలయంలో భక్తుల పూజలు

బీర్కూర్, ఆగస్టు 26 : బీర్కూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట జోడు లింగేశ్వర ఆలయం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలి



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గాంధారి, ఆగస్టు 26: మండలంలోని పొతంగల్ కలాం బుగ్గగండి సమీపంలో జరుగుతున్న కామారెడ్డి బాన్సువాడ ప్రధాన రహదారి బీటీరోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని ఎల్లారెడ్డి మదన్‌మోహన్‌రావు కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆర్అండ్‌బీ అధికారులు తొందరగా పనులు చేయించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రానికి మంజూరుచేసిన క్రీడామైదానం స్థలాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పరిశీలించారు. త్వరలోనే క్రీడామైదానం పూర్తవుతుందన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

దోమకొండ, ఆగస్టు 26 : పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.11,900 స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం సోమవారం దోమకొండ గ్రామంలో రైతు వేదిక వద్ద ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి వారిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన ధర్మారం(ఏ) విద్యార్థి



అవార్డు అందుకుంటున్న హర్షవర్ధన్

నవీపేట, ఆగస్టు 26 : మండలంలోని ధర్మారం(ఎ)కు చెందిన సూరహర్షవర్ధన్ అనే 10 సంవత్సరాల విద్యార్థి జాతీయస్థాయి కరాటే పోటీలో గోల్డ్ మెడల్ సాధించాడు. ఆదివారం చెన్నైలో సీఎస్ఐ బెయిన్‌స్కూల్‌లో జరిగిన షోషిన్ కయ్ కప్-2024 కరాటే పోటీలలో బాలుర జూనియర్ విభాగంలో హర్షవర్ధన్ గోల్డ్‌మెడల్ సాధించాడు. హర్షవర్ధన్ తండ్రి సూరవెంకట్ హైదరాబాద్‌లోని ఐడీపీఎల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. హర్షవర్ధన్ హైదరాబాద్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. కరాటే మాస్టర్ రాజావర్ధన్ వద్ద అతడు శిక్షణ పొందాడు. కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన హర్షవర్ధన్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

భక్తులతో కిక్కిరిసిన శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం



భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో భక్తుల తాకిడి

భిక్కనూరు, ఆగష్టు 26 : భిక్కనూరు మండలంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయం శ్రావణమాస సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. తెల్లవారుజామున నుంచే ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నానమాచరించి క్యూలో నిలబడి స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి, మాతా భువనేశ్వరీ అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేదమంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కోడెలు కట్టి, గండదీపాలు తీసి, పుట్టువెంట్రుకలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున దుకాణాలు వెలిశాయి. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం నుంచి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చండి



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

డిచ్‌పల్లి,ఆగస్టు 26 : డిచ్‌పల్లి బస్టాండ్, నడిపల్లి పంచాయతీ కార్యాలయం ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను ఎత్తైన గద్దెపైకి మార్చాలని స్థానికులు విన్నవించినా ట్రాన్స్‌కో అధికారులు మాత్రం తమకు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిలి మూగ జీవాలు మరణిస్తున్నాయి విద్యుత్ అధికారులు వెంటనే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా నిర్మించిన గద్దెపైకి మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

హెల్మెట్ భారం కాదు.. భద్రత



హెల్మెట్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రుద్రూరు, ఆగస్టు 26 : హెల్మెట్ భారం కాదు భద్రత అని, ద్విచక్ర వాహనదారులు తమ విధిగా హెల్మెట్‌ను ధరించాలని రుద్రూరు ఎస్ఐ పి.సాయన్న పేర్కొన్నారు. సోమవారం అంబర్ (ఆర్) గ్రామంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంబం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌ను ధరించాలని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల సురక్షిత ప్రయాణం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం



కోదండరామ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ మధుశేఖర్

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు26: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను చేయూత సేవ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్ సోమవారం పట్టుశాలువ, పూలబొకేతో సన్మానించారు. గవర్నర్ కోటలో ఎమ్మెల్సీగా నియామితులైన కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కలిసి పని చేసిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

లింగమయ్య ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న ట్రస్ట్ కార్యదర్శి వాసుగౌడ్

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 26 : ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో లింగమయ్య ఆలయ అభివృద్ధికి రాంనోముల చారిట్రబుల్ ట్రస్ట్ వారు రూ.25వేల విరాళంగా అందజేశారు. పిప్రి గ్రామానికి చెందిన నోముల రాంచందర్‌రెడ్డి తన జన్మదినం పురస్కరించుకొని సొంత గ్రామంలో ఆలయ అభివృద్ధికి రూ.25వేలను ట్రస్ట్ కార్యదర్శి వాసుగౌడ్ దేవాలయ కమిటీ సభ్యులు కొమ్ముల రాజేందర్, లింబాద్రిలకు అందజేశారు. రాంచందర్‌రెడ్డి తన ట్రస్ట్ తరఫున గ్రామంలో గ్రంథాలయం, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక పాఠశాలలో విద్యావాలంటీర్‌ను నియమించినట్టు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో దేవేందర్, అల్లకొండ నర్సయ్య, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



మృతిచెందిన సిరిగిరి సాయన్న

డొంకేశ్వర్, ఆగస్టు 26 : చేపలు పట్టేం దుకు వెళ్ళిన వ్యక్తికి వల చుట్టుకొని నీటిలో మునిగి మృతిచెందిన ఘటన సోమవారం డొంకేశ్వర్ మండలం మారంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సిరిగిరి సాయన్న(45) సోమవారం మధ్యాహ్నం ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో చేపలు పట్టేందు కు వెళ్ళాడు. చేపలు పట్టే క్రమంలో వల కాళ్ళకు చుట్టుకొని ప్రమాద వశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. మారంపల్లి గ్రామానికి చెం దిన నర్సయ్య మత్స్యకారుడు కాగా చేపలు పట్టి కుటుంబాన్ని పోషి స్తు న్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

రెంజల్‌లో మరొకరు..



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

రెంజల్ : మండలంలోని పేపర్ మిల్ గ్రామానికి చెందిన బోయి రాజు(41) అనేవ్యక్తి చేపల వేటకు వెళ్లి మృతిచెందాడు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో చేపలు పట్టడానికి వెళ్తున్నానని చెప్పి సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. దీంతో నీలా పెద్దవాగు చెక్‌డ్యాయ్ వద్ద అతనికి సంబంధించిన బట్టలు కనిపించగా అతని కోసం వాగులో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం కందకుర్తి నదిలో మృతదేహం లభ్యం కావడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ సాయన్న జాల్లర్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేపు శాంతియుత నిరసన దీక్ష

• సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ ఉపాధ్యక్షుడు

కమ్మర్‌పల్లి, ఆగస్టు 26 : సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 28న జిల్లా కలెక్టరేట్‌లో శాంతియుత నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ ఉపాధ్యక్షులు పొలాస అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫ్టోలో పొందుపర్చిన విధంగా తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు శాంతియుత నిరసన దీక్షకు జిల్లాలోని ఉపాధ్యాయులు, బోధనేతర ఉద్యోగులు, డీపీవో ఉద్యోగులు, మండల విద్యావనరులకేంద్రంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, మెసేంజర్లు, కాంప్లెక్స్ పరిధిలో పనిచేసే సీఆర్పీలు, పాఠశాల స్థాయిలో పనిచేసే పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌లు, భవిత కేంద్రాలలో పనిచేసే ఐఈఆర్పీలు, సీజీవీలు శాంతియుత నిరసన దీక్షకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

దోమకొండలో రాజేశ్వరుడి ఊరేగింపు

దోమకొండ, ఆగస్టు 26: మండల కేంద్రంలోని పలుగడ్డలో గల రాజేశ్వరుడి ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శావను వివిధ రకాల పూలతో అలంకరించారు. సాయంత్రం రాజేశ్వరుడు విగ్రహన్ని శావలో పెట్టి భజన పాటలతో ఉరడమ్మ, సుభాష్, పలుగడ్డ మీదుగా ప్రధాన వీధుల గుండా ఊరేగించి విగ్రహన్ని ఆలయంలోకి తీసుకెళ్లారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి భజన మండలి సభ్యులచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శావ నిర్వహకులు తెల్ల లింగం మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే శ్రావణమాసంలో భాగంగా శావ కార్యక్రమం పలు కాలనీల నుంచి ఊరేగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భక్తులు బాల్‌రాజవ్వ, పెద్ద లక్ష్మీ, లింగవ్వపోచవ్వ, తెల్ల నాగయ్య, నవీన్, శ్రీహరి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డిటౌన్, ఆగస్టు 26: కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ఎఫ్ ఫైళ్లను ముఖ్యమంత్రితో మాట్లాడి కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మందికి సీఎం సహాయనిధి నిధులు మంజూరు చేయించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎవరు పంచారనేది ముఖ్యం కాదని ఎవరు మంజూరు చేయించారనేది ముఖ్యమన్నారు. రుణమాఫీపై కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకుల్లో పోడు భూములు అసైన్‌మెంట్ భూములపై రుణాలు రద్దుకాలేదని తెలిపారు. ఎవరు కూడా అధైర్యపడవద్దని అందరి రుణాలు మాఫీ జరుగుతాయని మూడోవిడుత రెండు లక్షల రుణమాఫీ కూడా మొదలైందని తెలిపారు. ఎవరికి రుణమాఫీ జరగలేదో వారందరూ తమతమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా అందరికి రుణమాఫీ జరిగేలా చూస్తానని తెలిపారు. అదే విధంగా కాచాపూర్‌లో పీఏసీఎస్ ఏర్పాటు చేసినందుకు గ్రామస్తులు సన్మానించారు.

'డిగ్రీ లెక్చరర్ బదిలీని ఆపండి'



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్

కామారెడ్డిటౌన్, ఆగస్టు 26 : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఫారెస్ట్రి విభాగంలో పనిచేస్తున్న సుచారన్ అనే లెక్చరర్ బదిలీని ఆపాలని టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఫారెస్ట్రి అభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 160కి పైగా ఉందని కొన్ని సంవత్సరాలుగా సుచారన్ బోధన చేస్తున్నాడని ఇప్పుడు ఆయనను బదిలీచేస్తే లెక్చరర్ లేక విద్యార్థులకు తీవ్రనష్టం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా బీబీఏ రిటైల్ ఆపరేషన్ కోర్సుకు అధ్యాపకులను నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సాయిరాం, శివ, సాయికిరణ్, అభిలాష్, శరవణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలి

కామారెడ్డిటౌన్,ఆగస్టు 26 : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థులు డబ్బులు కట్టి సర్టిఫికెట్స్ తీసుకెళ్తున్నారని తెలిపారు. హాస్టల్‌లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, మెస్‌చార్జీలు పెంచాలని, విద్యారంగంలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మణికంఠ, జిల్లా కమిటీ సభ్యులు సాయి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ జెండావిష్కరణ

కామారెడ్డి రూరల్, ఆగస్ట్ 26 : విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్ సందర్భంగా సోమవారం స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం జెండా ఆవిష్కరించారు. 1964లో శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు స్థాపించి విశ్వహిందూ పరిషత్ 60వసంతాలు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ కార్యదర్శి తుమ్మల కృష్ణ, జిల్లా అధ్యక్షుడు ఆధారాపు నిత్యానందం, ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, కార్యదర్శి బొల్లి రాజు, పట్టణ అధ్యక్షుడు వెంకటస్వామి, మాతృశక్తి రాజశ్రీ విశ్వం గుప్తా, వివేకానంద అశోక్, మంచాల రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలి

బిచ్కుంద, ఆగస్టు 26: వాహనదారులు తమవెంట ఖచ్చితంగా వాహనధ్రువపత్రాలు ఉంచుకోవాలని బిచ్కుంద ఎస్ఐ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనధ్రువపత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెట్ లేని వాహనచోదకులకు జరిమానాలు విధించారు. మద్యం సేవించు వాహనాలు నడిపించినట్లు అయితే కేసు నమోదుచేయడంతో పాటు వాహనం సీజ్‌చేయబడుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

భవానిపేట, ముంబాజీపేటలలో జ్వర పరీక్షలు

లింగంపేట, ఆగస్ట్ 26 : లింగంపేట మండలంలో ఇటీవల డెంగీతో బీటెక్ విద్యార్థి మృతి చెందడం, కేసులు అత్యధికంగా నమోదు కావడంతో శాఖాధికారులు అప్రమత్తమయ్యారు. విషజ్వరాలు పెరిగిపోగా వైద్యశాఖ మండలంలోని ప్రతీగ్రామంలో జ్వర పరీక్షలు నిర్వహిస్తూ పరిసరాల శుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. నిల్వనీటిని ఎప్పటికప్పుడు తొలగించి కొత్త నీటిని నింపుకోవాలని ఇంటింటికి తిరిగి చెబుతున్నారు. మురికి కాలువలు శుభ్రపరిచి దోమల నివారణకు మందులను పిచికారి చేశారు. బ్లీచింగ్ పౌడర్ వేశారు. దోమ తెరలు వాడాలని గ్రామాలలోని ప్రజలకు సూచిస్తున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సునీత, అనురాధ, ఆశ కార్యకర్తలు ఉన్నారు.



ముంబాజీపేటలో బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న వైద్యసిబ్బంది

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కామారెడ్డిటౌన్, ఆగస్టు 26 : కామారెడ్డి జిల్లాలోని అన్ని మండలాలతో పాటు గ్రామాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషదారణలో అలరించారు. కామారెడ్డి పట్టణంలోని ఆయా ఆలయాల్లో శ్రీకృష్ణుకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఉదయం నుంచే ఆలయాలలో బారులు తీరి పూజలు నిర్వహించారు. అదేవిధంగా కామారెడ్డి పట్టణంలోని ఆయా పాఠశాలలో, అంగన్‌వాడీ సెంటర్‌లలో చిన్నారులు వేషధారణలో అలరించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీకృష్ణుని జన్మష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట, మద్దికుంట, అన్నారం,సింగరాయిపల్లి, ఇసన్నపల్లి, గొల్లపల్లి, కన్నాపూర్‌తండా, గిద్దగోకుల్‌తండా తదితర గ్రామాల్లో తండాల్లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గాంధారి : మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చద్మల్‌తండా, గుర్జాల్‌తండా, బీర్మల్‌తండా, నేరల్‌తండా గ్రామాలలో లబాన్ లంబాడీలు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తండాలలో ఉటికొట్టె కార్యక్రమం చేపట్టారు. గాంధారిలో కృష్ణుని వేషదారణలో విద్యార్థులు అలరించారు. ఉదయం నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున భోగేశ్వర ఆలయంలో పూజలు అర్చనలు నిర్వహించారు. గ్రామస్తులు భోగేశ్వరాలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం ఉట్టికొట్టె కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

రాజంపేట : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో సోమవారం కృష్ణాష్టమి సందర్భంగా బసవేశ్వర ఆలయ పరిధిలో కృష్ణుని దేవాలయంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో సోమవారం సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు పాల్గొన్నారు.

మద్నూర్ : ఉమ్మడి మద్నూర్ మండలంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని దేవాలయాల్లో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లల్లో భక్తి భావన పెంపొందిస్తూ చారిత్రక అంశాలను కథనాలను తెలియజేయాలని తలంపుతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులతో ప్రదర్శించబడిన పలు దృశ్య ప్రదర్శనలతో పాటు శ్రీ కృష్ణుడు రాధా గోపికల వేషదారణ అలరించాయి. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు ఉట్టికొట్టడం పలువురు ఆసక్తిగా తిలకించారు.

బీర్కూర్ : హిందువులు అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకునే పండుగలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి ఒకటి. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బాల బాలికలు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణతో సందడి చేశారు. ఆట, పాటలతో అలరించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నారు. శ్రీ కృష్ణుని వేషధారణలో ఉన్న చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాగిర్తిపల్లి అంగన్‌వాడీలో వేడుకలు

బాన్సువాడటౌన్ : బాన్సువాడ పట్టణ ప్రజలు సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలలో చిన్నారులు శ్రీకృష్ణుడు , గోపిక వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. ఆలయాల్లో సాయంత్రం ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సబంరాలను జరుపుకున్నారు.

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి కృష్ణమందిరంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ఆలయ అర్చకులు తీరొక్క పూలతో అలంకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు, లక్షాపుష్పార్చన, గణపతి పూజ, డోలారోహణం, చప్పన్ బోగ్, క్షీరాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ మేరకు ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని, భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రంగు హన్మాగౌడ్ మాటాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఆలయానికి వందల సంఖ్యలో భక్తులు రావడం జరిగిందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాగిర్తిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సం దర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే చిన్నారులకు కృష్ణుడి, గోపికల వేషధారణలను వేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం చిన్నారులతో కలిసి తల్లులు సహపంక్తి భోజనాలు చేశారు.

లింగంపేట : మండలంలోని లింగంపేట, మెంగారం, భవానిపేట, ఐలాపూర్, నల్లమడుగు, లింగంపల్లి, మోతె, పొల్కంపేటలతో పాటు పలు గ్రామాలలో చిన్న పిల్లలను రాధాకృష్ణులుగా వేషదారణ చేసి ఉత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రంలో చిన్న పిల్లలకు రాధాకృష్ణుల వేషధారణలో చక్కగా అలంకరించిన వారికి బహుమతులను అందజేశారు. గ్రామంలోని ప్రధాన వీధులలో ఏర్పాటు చేసిన ఉట్టి లను శ్రీకృష్ణ, బలరాములు వేషధారులు ఉత్సాహంగా పగులగొడుతూ అందరిని అనందపరిచారు. భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



లింగంపేటలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు



బీర్కూర్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఆరుగురు ప్రయాణికులకు గాయాలు
- క్షతగాత్రులతో మాట్లాడిన ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, ఆగస్టు 26 : ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొని ఆరుగురు ప్రయాణీకులకు తీవ్ర గాయాలైన సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ గేట్ మూలమలుపు వద్ద కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయింది. ప్రమాదవశాత్తు చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా బస్సులో ఉన్న ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. మదన్‌మోహన్‌రావు ట్రస్ట్ అంబులెన్స్ ద్వారా గాయాలైన ప్రయాణికులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉండగా అందిన సమాచారం మేరకు సం ఘటన స్థలానికి వెళ్లారు. గాయాలైన వారితో మాట్లాడి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు, సిబ్బందికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు.



చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

'మాజీ ఎమ్మెల్యే కృషితోనే కాచాపూర్ విండో ఏర్పాటు'

భిక్కనూరు, ఆగస్టు 26 : మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ కృషితోనే మండలంలోని బస్వాపూర్ విండో నుంచి కాచాపూర్ ప్రత్యేక విండోగా తిరిగి ఏర్పాటు కావడం జరిగిందని బస్వాపూర్ విండో తాజామాజీ వైస్‌చైర్మన్ మద్ది స్వామి అన్నారు. సోమవారం విండో కార్యాలయంలో మాజీడైరెక్టర్లు, నాయకులతో మాట్లాడుతూ గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ప్రస్తుత ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ దుర్బుద్ధితోనే కాచాపూర్ విండోను బస్వాపూర్‌లో విలీనం చేశాడని, ఆ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం కాచా పూర్ ప్రత్యేక విండోగా ఏర్పాటుకు గంపగోవర్ధన్ తీవ్రంగా కృషిచేశారని, అందుకు స్పందించిన అప్పటి సీఎం కేసీఆర్ కాచాపూర్ ప్రత్యేక సొసైటీగా తిరిగి ఏర్పాటు చేసేందుకు అన్న ఏర్పాట్లు చేయగా కిష్టాగౌడ్ డీసీసీబీ ఎన్నికల జరిగే వరకు జీవోను తాత్కాలికంగా నిలిపివేయడం జరిగిందని ఆయన అన్నారు. విండోలో పెద్దఎత్తున అవినీతికి జరిగిందని ఆరోపించారు.

పోచారంను కలిసిన విద్యుత్ శాఖ మీటర్ రీడింగ్ కార్మికులు

బాన్సువాడటౌన్ , ఆగష్టు 26 : ప్రభుత్వ వ్య వసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం ఆయన నివాసంలో విద్యుత్‌శాఖ మీటర్ రీడింగ్ కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. మీటర్ రీడింగ్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పోచారం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ మీటర్‌రీడింగ్ కార్మికులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో చందు , నర్సింలు , శివ , సాయి , గంగాధర్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే పోచారంను కలిసిన మీటర్ రీడింగ్ ఉద్యోగులు

శ్రావణ మాసం ఎంతో పవిత్రమైంది..

బాన్సువాడ : శ్రావణ మాసం ఎంతో పవిత్రమైందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుడు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శ్రావణమాసం చివరి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడ మండలంలోని బోర్లం ఆది బసవేశ్వర ఆలయంలో సోమవారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం ఎంతో పవిత్రమైందని, నియమనిష్టలతో ఆ పరమేశ్వరుడిని పూజిస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోమయప్ప, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మంద శ్రీనివాస్, భూషణ్, మన్నెచిన్న సాయిలు తదితరులున్నారు.

15 రోజుల్లో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

- రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఆగస్టు 26 : డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళలో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి అర్హులైన వారికి 15 రోజుల్లో డబుల్‌బెడ్ రూమ్ పంపిణీ చేస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న మురికి కాలువలు, రోడ్లు, విద్యుత్ పనులను సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పూర్తి చేయాలని సూచించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నిర్మాణాలుపూర్తి చేయక శిథిలావస్థకు వెళ్లాయని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు ఎటువంటి అనుమానాలు పెట్టుకోవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అందజేసేలా ప్రభుత్వం కసరత్తు నిర్వహిస్తుందని, నియోజకవర్గంలో ఇప్పటి వరకు 29, 739 మంది రైతులకు 205 కోట్ల రుణమాఫీ వచ్చిందన్నారు. అదే విధంగా రుణమాఫీ కాని రైతుల కోసం ప్రభుత్వం రైతు భరోసా పంట రుణమాఫీ అనే యాప్‌ను రూపొందించిందన్నారు. యాప్‌లో మంగళవారం నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు రుణమాఫీ కాని వారి ఇండ్ల వద్దకు వచ్చి రైతుల పేర్లను నమోదు చేసుకుంటారని తెలిపారు. రెండు లక్షలపైన ఉన్న రుణాలు చెల్లించాలి, తరువాత అధికారులు పరిశీలించి వారికి మాఫీ చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం అని, ప్రతిపక్షం బూటకపు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినో ద్‌గౌడ్, లింగంపేట మండల అధ్యక్షుడు నారాగౌడ్, గయా జుద్దీన్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, అజార్ ఖాద్రి, విద్యాసాగర్, నాగం గోపికృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

- వైద్యాధికారిని ఆస్మా
- భూంపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

సదాశివనగర్, ఆగస్టు 26: తప్పుడుప్రచారాలను ప్రజలు నమ్మి భయాందోళనకు గురికావద్దని వైద్యాధికారిని ఆస్మాఆఫ్రిన్ అన్నారు. రెండు రోజులుగా భూంపల్లిలో డెంగ్యూ వ్యాధితో ఇద్దరు చిన్నారులు చనిపోయారని వస్తున్న ప్రచారాలలో నిజం లేదన్నారు. భూంపల్లికి చెందిన రన్విత్ జ్వరం సోకిని రెండోరోజు పీఎంపీ వద్ద తీసుకున్న హైడోస్ ఇంజక్షన్ వల్ల, అలాగే మనస్విని జ్వరం వచ్చిన మరుసటి రోజు పీఎంపీ వద్ద హైడోస్ ఇంజక్షన్ తీసుకోగా చనిపోయారని తెలిపారు. వీరిద్దరికి డెంగ్యూ నిర్ధారణ కాలేదని తెలిపారు. సదాశివనగర్‌కు చెందిన చిలుక నరేష్ మిర్యాలగూడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తాడని ఈనెల 19న జ్వరం రావడంతో కామారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరడం జరిగిందని తెలిపారు. షుగర్ నియంత్రణలో లేకపోవడంతో హైదరాబాద్ రిఫర్ చేశారని తెలిపారు. ముగ్గురికి డెంగ్యూ సోకలేదన్నారు. వాతావరణ మార్పుల వల్ల జ్వరం వస్తుందని ప్రజలు వీటిని గమనించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదే విధంగా ఎంపీడీవో సంతోష్‌కుమార్, డీఎల్‌పీఓ శ్రీనివాస్‌తో కలిసి భూంపల్లిలోని పరిసరాలను పరిశీలించారు.



భూంపల్లిలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - డబుల్ ఇస్మార్ట్
దర్శన్ - మిస్టర్ బచ్చన్
ప్రియా 70 - తంగలన్
ప్రియా 35 - ఆయ్

బాన్సువాడ

మహేశ్వరి - మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర - తంగలాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

